# ముగ్గురు వింత వ్యక్తులు

పూర్వము ఒకరాజు వుండే వాడు. ఆరాజుకు ఒక పుత్రుడు వున్నాడు. ఒకరోజున రాజు తన పుత్రునిపిలచి "నాయనా నేను చాలా ముసలివాడి నయ్యాను. ఇంక ఎంతోకాలము బ్రతకను. నేను మరణించులోపునే నీవుపెండ్లి చేసుకోవలె"నని చెప్పాడు. "నాన్న గారూ మీరు చెప్పినట్లే చేసుకొంటాను. కాని నేను ఎవరిని పెండ్లి చేసుకోవలెనో మాత్రము నాకు తెలియ"దని యువరాజు జవాబు ఇచ్చాడు. అప్పుడు రాజు ఒక బంగారు తాళము చెవిని యువరాజు కిచ్చి "నీవు మేడ పైఅంతస్థులోనికి పోయి అచ్చటనున్న అన్నిచిత్రములుచూచి ఏది నచ్చినదో చెప్పు" అన్నాడు.

యువరాజు ఆలస్యము చేయకుండా మేడ మీదకు వెళ్లి బంగారు తాళముచెవితో తలుపు తెరచి లోనికి ప్రవేశించాడు. అది యొక పెద్ద వరండా. ఆ వరండా అంతా ఆకాశమువలె నీలిరంగు తోనూ, మధ్య మధ్య వెండి నక్షత్రములతో మెరుస్తున్నది. నేల మీద పచ్చని రత్నకంబళ్లు ఉన్నాయి. ఆగదిగోడకు పన్నెండు పెద్దకిటికీలున్నాయి ఒక్కొక్క కిటికీలో ఒక్కొక్క రాకుమార్తె మాయచిత్రమున్నది. ఆ చిత్రములు బంగారు చట్రములో కట్టబడి వున్నాయి చక్కని రంగులతో ఆచిత్రములు వేయబడినవి. ఆమాయచిత్రములు ఒకదానికంటె మరొకటి అందముగా వున్నాయి. యువరాజు ఆశ్చర్యముతో చూస్తుండగా ఆచిత్రముల లోని రాకుమార్తెలు కదలుతూ, చిరునవ్వు నవ్వారు. ఆ పన్నెండు కిటికీలలో ఒకదానికి తెల్లని తెర కట్టబడివుంది. ఆ తెర వెనుక ఏమి వున్నదో చూడవలెనని యువరాజు తెరను ప్రక్కకు లాగాడు. అచ్చట తెల్లని దుస్తులతో, వజ్రవైడూర్యముల కిరీటము ధరించినయువతి చిత్రమున్నది. ఆమె అందరికంటె అందమైన యువతి. కాని ఆమె

**అముజాల రామారావు**

ముఖములో ఏదో విచారము కనిపించింది. యువరాజు ఆచిత్రమునే ఆశ్చర్యముతో చూస్తూ "ఈమెను తప్ప తదితరులనువివాహమాడను" అనునంతలో ఆయువతి గులాబి పువ్వు వికసించినట్లు నవ్వింది. అప్పుడు మిగిలిన చిత్రములన్నియు మాయమయ్యాయి యువరాజు తండ్రివద్దకువచ్చి తను చూచిన చిత్రముగురించి చెప్పాడు. రాజు మూర్ఛపోయి కొద్దిసేపట్లో తేరుకొని "నీవు మంచిఆమెను ఎంచుకొనలేదు. ఇప్పుడు ఆమె ఒకగొప్ప మంత్రగాని చెఱలో బంధింపబడి వున్నది ఆమెను విడిపించుటకు వెళ్ళినవారెవరు ఇంతవరకు తిరిగి రాలేదు. కాని చేయవలసిందేదో చేయక తప్పదు. నీ పెళ్ళి నీఅదృష్టముకూడా పరీక్షించు. సురక్షితముగా ఇంటికి తిరిగిరా" అని దీవించాడు.

## 2

అతడుతండ్రివద్ద శెలవు తీసుకొని గుర్రము పై రాకుమార్తెను వెదకుతూ బయలుదేరాడు. అట్లు పోగా పోగా ఒకదట్టమైన అడవి వచ్చింది. ఏవైపునకు పోవలెనో అనిచూస్తుండగా వెనుకనుండి 'ఆగు' మని ఎవరో కేక వేశారు. ఒక పొడుగైనమనుష్యుడు తనవైపుకే వస్తున్నాడు. ఆపొడుగుమనిషి యువరాజునుచూచి "నన్ను మీ నౌఖరుగా పెట్టుకోండి. మీకు చాలా లాభము చేకూరుతుంది"అన్నాడు. "నీవు ఎవరవు. ఏమిచేయగలవని" యువరాజు అడిగాడు. "నేను పొడుగు కాళ్లవాడిని నేను ఎంత ఎత్తు అయినా పెరుగగలను. అదిగో ఆఎత్తుచెట్టు చూడండి. దాని మీదవున్న పిట్టగూడును చెట్టు ఎక్కకుండా క్రిందికి తెస్తాను" అన్నాడు.

పొడుగుకాళ్లవాడు ఆచెట్టుఅంత ఎత్తుపెరిగి ఆగూడు తెచ్చి యువరాజు కిచ్చాడు. "నేను ఈ అడవి నుండి బయటపడితే బాగుండును కాని ఈగూడువలన నాకేమి లాభము" అని యువరాజు అన్నాడు "అది ఎంత భాగ్యము, అలాగునే చేయవచ్చును" అని అతడు అడవిలోవున్న చెట్లన్నిటి

లోను ఎత్తైన చెట్టుకంటె మూడు రెట్లుగా పెరిగాడు. చుట్టూచూచి తన మామూలు ఎత్తులోనికిదిగి ఒక దగ్గిరదారిన తీసుకొని వెళ్లాడు. కొద్దిసేపట్లో వారిద్దరు అడవి అవతలకు చేరారు. అంతలో పొడుగు మనిషి "అదుగో అటుపోవుచున్న వాడు నాస్నేహితుడు. వానిని కూడా మీనౌకరుగా పెట్టుకోండి. వాడుకూడ మీకు చాలా వుపయోగ పడతాడు" అన్నాడు "వానిని ఇచ్చటకు పిలు. వాడు నాకేమి వుపకారము చేస్తాడో చూస్తానని యువరాజన్నాడు. కొద్దిసేపట్లో వానిని యువరాజు వద్దకు పొడుగుకాళ్లవాడు తీసుకొచ్చాడు.

ఆరెండవ వ్యక్తి పొట్టిగా, లావుగా, పెద్ద పొట్టగలిగివున్నాడు.

"నీవు ఎవరవు, ఏమిపని చేయగల"వని యువరాజు రెండవ వ్యక్తిని అడిగాడు. "వేళాకోళముగా నన్ను పెద్దపొట్ట వాడంటారు. నేను ఎంత వెడల్పుగానైన పెరగగలను. మీరు త్వరగా అడవిలోకి పారిపోండి" అంటూ అడ్డంగాపెరిగిపోజొచ్చాడు. యువరాజునకిదేమి అర్థంకాలేదు. పొడుగుమనిషి ఖంగారు పడుతూ యువరాజును తీసుకొనిఅడవిలోనికి పరుగెత్తాడు. ఇంతలో పెద్ద పొట్ట మనిషి అడ్డముగా పెరుగుతూచెట్లు, కొండలు తోసివేస్తూ పెద్దపర్వతము వలె దొర్లుతూ అంతా కప్పివేశాడు. కొద్దిసేపట్లో పెద్ద పొట్ట మామూలుగా మారింది. "నీవు నా కూడారా" అని యువరాజన్నాడు.

వారు ముగ్గురు కొంతదూరము వెళ్లేసరికి ఒకపెద్ద మైదానము వచ్చింది. అచ్చట ఒకమనిషి తన కండ్లకు గంతలు కట్టుకొని కనిపించాడు. "అయ్యా అతను మా మూడవ స్నేహితుడు. వానిని కూడా మీనౌకరుగా పెట్టుకోండి. మీకుచాలా వుపయోగ పడతాడని" పొడుగుమనిషి అన్నాడు. "నీవు ఎవరవు నీవు ఎందు చేత కండ్లకు గంతలు కట్టుకున్నావని యువరాజడిగాడు. "నా కండ్లకు గంతలు వుంటేనే చాలా బాగుగా చూడగలను. నాకండ్లకు గంతలు లేకుండా ఏవస్తువునైనా తీక్షణంగా చూస్తే ఆవస్తువు తగులబడిపోతుంది. అట్లు తగలబడని వస్తువులు ముక్కలు, ముక్కలుగా బ్రద్దలైపోతాయి. అందుచే నన్ను తీక్ష్ణదృష్టి అంటారు. నాకు దివ్య దృష్టికూడా వుంది" అంటూ అతడు ఒక పెద్దరాయివైపు తిరిగి "ఇందులో బంగారంవుంది" అని అంటూ కండ్లగంతలు విప్పిఆరాయి వైపు తీక్షణంగా చూశాడు. ఆరాయి కొద్దిసేపట్లో ముక్కలుగా బ్రద్దలై యిసుకగా మారింది. ఆఇసుకఅంతా బంగారము వలె మెరుస్తోంది. దివ్యదృష్టి ఆఇసుక కొంత యువరాజు వద్దకు తెచ్చాడు. అదిఅసలైనబంగారము. "ఓ! మానవమాత్రుడెవడు నీవంటి మనిషిని డబ్బుతో కొనలేడు. అయితే మాంత్రికుని మాయ భవనం ఎక్కడుంది? ఇచ్చటకు ఎంత దూరములో వుంది? అక్కడ ఇప్పుడు ఏమి జరుగుతున్నదో చెప్ప"మని దివ్యదృష్టిని యువరాజు అడిగాడు. "మీరు ఈ గుర్రముమీద అయితే ఒక సంవత్సరములోకూడా అక్కడకు చేరలేరనుకుంటా. మాముగ్గురి ఉపకారముతో ఈరోజునే మీరచ్చటకు చేరగలరు. రాజకుమార్తె ఒక ఎత్తైన భవనములో కూర్చొని వుంది. ఆమెను ఒక మాంత్రికుడు కావలా కాస్తున్నాడు" అని చెప్పాడు. రాకుమారుడు "మీందరు ఆమెను విడిపించుటకు నాకు సహాయము చేయవలె" నన్నాడు. వారు ముగ్గురు అందుకు అంగీకరించారు. తరవాత బయలుదేరి దారిలో పెద్దపెద్ద కొండలు,దట్టమైన అడవులుదాటుతూ సాయంత్రం అయ్యేలోపున వారు మాంత్రికుని భవనం చూశారు. చీకటిపడు సమయములో వారు ఒకఅగడ్త దాటి మాంత్రికుని భవనం చేరారు.

## 3

ఆభవనములో, ఎందరోరాజులు శిలలుగా మారివుండటం చూచారు. అన్నిగదులు దాటి భోజనశాలలో ప్రవేశించారు. ఆగదిఅంతా ప్రకాశవంతముగా వున్నది అచ్చట ఒక మేజాబల్ల మీద నలుగురు తినుటకు సరిపడిన తినుబండారాలు, సారాయి మొదలగునవి వున్నాయి. అచ్చటకు ఎవరైనా వచ్చెదరేమోఅని వారు చాలాసేపు నిరీక్షించారు. ఎవరు రాకపోవుటచే ఎవరికి ఇష్టమైనది వారు తిన్నారు. ఇంతలో అకస్మాతుగా అచ్చట ఒక తలుపు తెరవబడి ఒకముసలి మాంత్రికుడు నల్లని దుస్తులలో అచ్చటకు వచ్చాడు. వాని నడుముచుట్టూ మూడు ఇనుపగొలుసులు చుట్టబడివున్నాయి. తనతో ఒక అందమైన యువతినికూడా తీసుకువచ్చాడు. ఆమె తెల్లనిదుస్తులు ధరించివుంది. వజ్రకిరీటము ధరించినది. ముఖము చాలా విచారముగా

వున్నది. యువరాజు ఆమెను గురించి ఆమెతో మాట్లాడుటకు ముందుకు నడిచాడు. యువరాజు ఏమీ చెప్పకమునుపే "నీవు ఇచ్చటకు ఎందుకు వచ్చావో తెలుసు. చాలా మంచిది. నీవు ఆమెను తీసుకు వెళ్ళగలిగితే తీసుకువెళ్లు. రాకుమార్తెను నీ గదిలో మూడు రాత్రులు వుంచుతాను. ఆమె నీ వద్దనుంచి మాయమవకుండా మూడు రాత్రులు ఆమెను కాపలా కాయి. ఆమె మాయమైపోతే నీవు, నీ నౌకర్లు శిలలుగా మారతారు" అని చెబుతూ రాకుమార్తెను అగదిలో వదలి మాంత్రికుడు మాయమయ్యాడు.

ఆ రాకుమార్తె చాలా అందకత్తె. యువరాజు ఆమెతో మాట్లాడి ఎన్నో ప్రశ్నలు వేశాడు. కాని ఆమె దేనికీ జవాబు ఇవ్వలేదు. పాలరాతి బొమ్మవలె కూర్చున్నది. యువరాజు ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. ఆమె ఆగదినుంచి మాయమవకుండా యువరాజు కాపలా కాయాలనుకున్నాడు. అందుచే ఆ రాత్రి నిద్రపోకూడదని యువరాజు నిశ్చయించుకొన్నాడు. పొడుగుకాళ్లవాడు ఆగదిలో ఎత్తుగా పెరిగాడు. ఒక ఎలుకైనను ఆగదిలోకి వచ్చుటకుగాని, పోవుటకుగాని వీలులేనట్లుగా తలుపుకు దట్టముగా పెద్దపొట్టవాడు ఉన్నాడు. ఇక దివ్యదృష్టి మాంత్రికుడు వచ్చిన తలుపువైపే చూస్తూ కావలా కాస్తున్నాడు. కొద్దిసేపటికి వారు కునుకుపాట్లు పడజొచ్చారు. ఆ రాత్రంతా వారంతకు నిద్రపోయారు.

తెల్లవారిన తరవాత యువరాజు ముందు మేల్కొన్నాడు. రాకుమార్తె ఆగదిలో లేకపోవుట యువరాజు చూశాడు. తరువాత ముగ్గురు నౌకర్లను మేల్కొలిపి ఏమి చేయవలెనని అడిగాడు. "భయపడకండి" అంటూ దివ్యదృష్టి కిటికీగుండా బయటకు చూశాడు. "నేను రాకుమార్తెను చూడగలిగాను, ఇక్కడకు వంద మైళ్ళ దూరములో ఒక దట్టమైన అడవివుంది ఆ అడవి మధ్యలో ఒక సింధూరపు చెట్టువుంది. ఆ చెట్టు చివరకొమ్మకు ఒక సిందూరపు కాయ వున్నది. ఆ కాయే రాకుమార్తె" అని దివ్యదృష్టి చెప్పాడు. తక్షణమే పొడుగుకాళ్ళవాడు దివ్యదృష్టిని భుజముపై నెక్కించుకొని చాలా ఎత్తుగా పెరిగాడు. దివ్యదృష్టి దారిచూపించగా అడుగుకు పదిమైళ్ళ చొప్పున నడచాడు. అడవిలో చెట్టువద్దకు వెళ్లి సిందూరపుకాయ యువరాజువద్దకు తెచ్చుటకు ఎంతో కాలము పట్టలేదు. పొడుగుకాళ్లవాడు సిందూరపుకాయ యువరాజునకిచ్చి నేలపై కొట్టమన్నాడు. యువరాజుకు అట్లు చేయగానే రాకుమార్తె అతని ప్రక్కన ప్రత్యక్షమైంది. సూర్యోదయము అప్పుడే అయింది. మాంత్రికుడు ఆగదిలో ప్రవేశించాడు, రాకుమార్తె ఆ గదిలో వుండుట చూచి మాంత్రికుడు కోపము పట్టలేక పోయాడు. అతని నడుముకు చుట్టబడివున్న ఇనుపగొలుసులలో ఒకటి ముక్కలై క్రిందపడింది. రాకుమార్తెను తన వెంట తీసుకొని మాంత్రికుడు వెళ్ళిపోయి సాయంత్రమవగానే తిరిగి తీసికొనివచ్చి ఆ గదిలో వదలి వెళ్ళిపోయాడు. రాకుమార్తెను కావలా కాయుటకు వారందరు ఎంత ప్రయత్నించినప్పటికీ నిదురపోయారు. తెల్లవారాక రాకుమార్తె మాయమవుట చూచారు. దివ్యదృష్టి "అదిగో రెండువందల మైళ్లదూరములో ఒక పెద్దకొండ వుంది. ఆ కొండలో రాయివుంది. ఆ రాయిలో ఒక వజ్రముంది. ఆ వజ్రమే మన రాణి" అని చెప్పాడు. ఇదివరకువలె పొడుగుకాళ్లు దివ్యదృష్టిని భుజముపై నెక్కించుకొని పెద్దగా పెరిగి అడుగునకు ఇరువది మైళ్ల చొప్పున వెళ్లాడు. దివ్యదృష్టి ఆ కొండవైపు తీక్షణముగా చూడగా వెంటనే ఆ కొండ బ్రద్దలై ముక్కలు ముక్కలైంది. అందులో వజ్రము తీసుకొని వారు యువరాజు వద్దకువచ్చారు. ఆ వజ్రము యువరాజు క్రింద పడవేయగానే రాకుమార్తె ఆగదిలో నిల్చుంది. కొద్దిసేపట్లో మాంత్రికుడు ఆగది ప్రవేశించి రాకుమార్తె ఆగదిలో వుండుట చూచి కోపముతో అరిచాడు. మాంత్రికుని నడుముకు చుట్టబడిన ఇనుపగొలుసులలో మరొక గొలుసు ముక్కలై క్రిందపడింది. కోపముతో రాకుమార్తెను ఆగదినుండి తీసుకు వెళ్లాడు. చీకటిపడగానే మాంత్రికుడు రాకుమార్తెను ఆగదిలోనికి తిరిగి తీసుకొనివచ్చాడు మాంత్రికుడు యువరాజును కోపముతో చూచి "ఆఖరికి విజయ మెవరిదో చూడు" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రికూడా యథాప్రకారంగా రాకుమార్తె మాయమైంది. సూర్యోదయము కాకమునుపే యువరాజు మేల్కొని దివ్యదృష్టిని మేల్కొలిపి రాకుమార్తె ఎచ్చట నున్నదని అడిగాడు. "రాకుమార్తె

ఇద్దిటకు మూడువందల మైళ్ల దూరములోవుంది. అక్కడ ఒక సముద్రమువుంది. ఆ సముద్రము మధ్యలో బాగా అడుగు భాగమున ఒక నత్తగుల్లవుంది. ఆగుల్లలో ఒక వుంగరంవుంది. ఆ వుంగరమే రాకుమార్తె. ఈసారి మన పెద్దపొట్టసహాయం కావాలి" అని దివ్యదృష్టి చెప్పాడు. పొడుగువాడు ఇద్దరను చెరియొక భుజముపై నెక్కించుకొని అడుగునకు ముప్పది మైళ్ళచొప్పున నడచి ఆగుల్ల ఎక్కడున్నదో దివ్యదృష్టి పొడుగుకాళ్లకు చెప్పాడు. పొడుగువాడు తనచేతి కందినది పెరికాడు కాని లాభములేకపోయింది. "మీరు కంగారు పడకండి" అని అంటూ పెద్దపొట్ట తనపొట్టపెంచి ఆసముద్రములోని నీరు త్రాగసాగాడు. సముద్రములోనినీరు సగమునకు పైగా తగ్గింది. అప్పుడు పొడుగువాడు ఆ గుల్లను సులభముగా తీసుకొని వచ్చాడు. ఆగుల్లలోని వుంగరము తీసి తన స్నేహితులతో యువరాజువద్దకు బయలుదేరాడు. పెద్దపొట్ట సముద్రంలోని నీరు త్రాగుటచేత బరువుగా వున్నాడు. అందుచే పొడుగువాడు వేగముగా నడవలేకపోయాడు. పెద్దపొట్టవాణ్ణదింపి ఒకలోయలో వదలి మరల వస్తామని దివ్యదృష్టితోకలసి వెళ్లాడు.

సూర్యోదయము అవుతోంది. అందుచే యువరాజు చాలా కంగారు పడసాగాడు. తన స్నేహితులు ఎందుచేత రాలేదని ఆలోచిస్తున్నాడు. అంతలో మాంత్రికుడు ఆగదిలో ప్రత్యక్షమై నల్లనక్కలా మారాడు. ఆగదిలో రాకుమార్తె కానరాక పోవుటచే వికటముగా నవ్వుతూ యువరాజువద్దకు రాసాగాడు. అప్పుడు ఆ ప్రక్కనున్న కిటికీఅద్దము పగిలి ఆకిటికీద్వారా వుంగరము ఆగదిలో వచ్చిపడింది. ఆ వుంగరము నేలమీద పడగానే రాకుమార్తెగా మారి నిలబడింది. దివ్యదృష్టి తన యజమానికి రాబోవుఆపద తెలుసుకొని ఆ సంగతి పొడుగువాడితో చెప్పి తొందర పెట్టాడు. అందుచే పొడుగువాడు రెండడుగులు ముందుకు వేసి కిటికీద్వారా ఆవుంగరం గదిలోనికి విసిరాడు. మాంత్రికుడు పట్టలేనికోపముతో, ఆవేశంతో, పెద్దపెద్ద కేకలు వేశాడు. మాంత్రికుని నడుముకు చుట్టబడివున్న మూడవ గొలుసు ముక్కలై జారిపోయింది. మాంత్రికుడు భయంకరమైన పెద్ద నల్లపక్షిగా మారాడు. ఆపక్షి కిటికీ ద్వారా బయటకు ఎగిరిపోయింది.

## 4

అప్పుడు మాత్రమే రాకుమార్తె యువరాజుతో నవ్వుతూ మాట్లాడింది. తనను రక్షించినందుకు యువరాజుకు అభివందనము తెలిపింది. మాంత్రికుని భవనములో ఉన్న శిలలన్నీ మరల మామూలు మనుష్యులుగా మారాయి. తమను రక్షించినందులకు వారందరు యువరాజునకు అభివందనములు తెలిపారు. "మీరు అభివందనములు తెలుపవలసినది నాకు కాదు. నా స్నేహితులగు పొడుగుకాళ్లు, పెద్దపొట్ట, దివ్యదృష్టిలకు" అని యువరాజుఅన్నాడు. యువరాజు రాకుమార్తెతోను తనవద్దను స్నేహితులతోను తన రాజ్యమునకు బయలుదేరాడు. దారిలోవిడచిన పెద్దపొట్టను కలుసుకొని వానినికూడా తీసుకువెళ్లాడు. ముసలిరాజు తన కుమారుని విజయమునకు సంతోషపడి ఎంతో వైభవంగా పెండ్లి చేశాడు. యువరాజు తన ముగ్గురు స్నేహితులను తనవద్దనే ఉండమని కోరాడు. కాని వారు ఒకచోట కూర్చొని కాలముపోనిచ్చుటకు ఇష్టములేదన్నారు. సెలవుతీసుకొని వారు ముగ్గురు దేశాటనమునకై వెళ్ళిపోయినారు.

(ఒకఆంగ్లకథ ఆధారంగా)

★



కేంద్ర ప్రభుత్వము వారిచేత బాల సాహిత్యంలో ఉత్తమ గ్రంథంగా నిర్ణయించబడి ప్రథమ బహుమతి నందుకొన్న "బొమ్మరిల్లు" రచయిత శ్రీ కవిరావు.

గుమాస్తా: సార్, నేను నలుగురిపని చేస్తున్నాను. నా జీతం హెచ్చించాలండీ

మేనేజరు: అది మాత్రం అసంభవం... నీవు ఎక్కువ చేసే పని ఏ ముగ్గురిదో చెప్పు, వాళ్ళని బర్తరఫ్ చేస్తాను.